క్లుప్తంగా

మళ్లీ మొరాయించిన లిఫ్ట్



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్ ఫామ్ వైపు ఉన్న లిఫ్ట్ మళ్లీ మొరాయించింది. మరమ్మతులు చేసిన పది రోజులకే పాడైపోయింది. మరో వైపు తరచూ లిఫ్ట్ మొరాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలోని లిఫ్ట్, కోచ్ ఇండికేటర్లు మొరాయిస్తున్నాయి. నిర్వహణా లోపం కారణంగా లిఫ్ట్ అలకపాన్పు వహిస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. లగేజీలు, పిల్లలతో మెట్లు ఎక్కలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి లిఫ్ట్ మొరాయించడంతో ప్రయాణికులు తిట్టుకుంటూ లగేజీలు మోసుకొని వెళ్తున్న పరిస్థితి కనిపించింది.

కొత్తమ్మతల్లి తొలేళ్ల జాతర నేడు



కణితి గ్రామదేవత కొత్తమ్మ తల్లి అమ్మవారు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి గ్రామ దేవత కొత్తమ్మ తల్లి అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్, కార్యదర్శి విజయరామరాజు తెలిపారు. ఆదివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మంగళవారం అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు సూరిశెట్టి పెంటారావు, ప్రగడ శ్రీను, చిత్తాడ సన్యాసిరావు, మార్పు శేషు, దుగ్గపు దానప్పలు, ఐతికంశెట్టి రవి, గొనప సన్యాసినాయుడు, బొడ్డ సన్యాసిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

పెదగంట్యాడ: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో డ్వాస్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. వనితి వైజాగ్ స్టీల్ పెదగంట్యాడ అధ్యక్షురాలు బెల్లాల శశికల చేతుల మీదుగా నడుపూరులోని నూకాంబిక ఆలయం వద్ద ఓ వ్యక్తికి తోపుడు బండి అందజేశారు. అలాగే రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి గొడుగులు అందించారు. ఈ కార్యక్రమంలో కట్టా సతీష్, కేసారపు నాగేశ్వరరావు, బంగారాజు, సతీష్‌బాబు, గ్రంధి వాసుదేవమూర్తి, బొడ్డు కృష్ణారావు, బెల్లాల వెంకటరావు, బెల్లాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9వ తరగతుల్లో ఎస్సీ కేటగిరీలో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు.ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థి ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్‌తో వచ్చి స్థానిక గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సబ్బవరం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుండిచి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు.మరిన్ని వివరాలకు 80084 69493 నంబర్‌లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

క్రీడాకారుల్లో అలముకున్న నైరాశ్యం

- ప్రోత్సాహం కరువై.. నీరుగారుతున్న ఉత్సాహం
- సౌకర్యాలు లేక వాకర్స్‌కూ తప్పని అవస్థలు



వాకింగ్ చేస్తున్న మహిళలు



చిన్నారుల రన్నింగ్ ప్రాక్టీస్

పెదగంట్యాడ: ప్రోత్సాహం కొరవడడంతో క్రీడాకారుల్లోని ఉత్సాహం నీరుగారుతోంది. ప్రతిభకు పదును పెట్టుకునే అవకాశం లేకపోవడంతో క్రీడాకారుల్లో నైరాశ్యం కనిపిస్తోంది. ఇక్కడ మంచి ఆట స్థలం ఉన్నా.. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. క్రీడల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలలు కంటున్న మండలంలోని 14 గ్రామాల్లోని క్రీడాకారులకు నిరాశే ఎదురవుతోంది. తమకు అనుకూలంగా.. అందుబాటులో సుమారు ఆరు ఎకరాల స్థలం ఉన్నా సదుపాయాలు లేకపోవడంతో నిరుత్సాహ పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తమ భవిష్యత్‌కు భరోసా ఏదంటూ నిట్టూరుస్తున్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ వెనుక విశాల క్రీడా మైదానం ఉంది. కొంతమంది క్రీడాకారులు, కోచ్‌లు వారికున్న అవకాశం మేరకు దాతల సహకారం, సొంత నిధులతో మైదానాన్ని చదును చేయించారు. మట్టి తీసుకొచ్చి గోతులు పూడ్చి క్రీడాకారులకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు అక్కడ రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారుల సందడి కనిపిస్తోంది. పిల్లల నుంచి పెద్దల వరకూ అక్కడే ఆటలాడుతూ, వాకింగ్ చేస్తూ కనిపిస్తున్నారు.

సౌకర్యాల కోసం ఆశగా ఎదురుచూపులు

ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు పెద్ద సంఖ్యలో స్థానికులు ఇక్కడి మైదానానికి వస్తున్నారు. కానీ అక్కడ వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు బాక్సింగ్ ప్రాక్టీస్ కోసం ఇదే మైదానంలో తిప్పలు పడుతున్నారు. కోచ్‌ల సహకారంతో బాక్సింగ్, కరాటే ఉచితంగా నేర్చుకుంటున్నారు. వాకింగ్, రన్నింగ్ కోసం ఇక్కడ వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే బాక్సింగ్ ప్రాక్టీస్ కోసం బాక్సింగ్ రింగ్, వాలీబాల్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడల కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అవసరమైన క్రీడా సామగ్రిని కూడా అందజేయాలని కోరుతున్నారు. యోగా స్టేజ్, అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలంటున్నారు. అలాగే ఈ మైదానంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో మహిళలు వాకింగ్ కోసం వస్తున్నారు. వారి కోసం మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



ఇక్కడ చిన్నారులకు ఉచితంగా బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. కానీ సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారుల్లో ఆసక్తి తగ్గిపోతోంది. చుట్టు పక్కల గ్రామాలకు ఇదొక్కటే పెద్ద మైదానం. సౌకర్యాలు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలి.

– జీవీ రెడ్డి, బాక్సింగ్ కోచ్, ఎక్స్ ఆర్మీ, పాత అయ్యన్నపాలెం

ట్రాక్ ఏర్పాటు చేయాలి



రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ రన్నింగ్ చేస్తున్నాం. అయితే ట్రాక్ లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. క్రీడాకారులకు అవసరమయ్యే రీతిలో మైదానాన్ని సిద్ధం చేసి ప్రోత్సహించాలి.

– వై.సాయికృష్ణ, కీడాకారుడు, నెల్లిముక్కు

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు దుస్థితి



దీక్షా శిబిరంలో మల్లయ్య, తౌడన్న, ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాధించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో విశాఖ ఉక్కును కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కర్మాగారం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగానికి ఫలితం ఉంటుందని, వేలాది ఎకరాలు నామమాత్రపు ధరకు అప్పగించిన నిర్వాసితుల త్యాగానికి గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసనాయుడు, పుల్లారావు, విళ్లా రామ్మోహన్ కుమార్, ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

విమల విద్యాలయం ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు



ఉపాధ్యాయులకు మద్దతు తెలుపుతున్న పూర్వ విద్యార్థులు

ఉక్కునగరం: స్థానిక విమల విద్యాలయం ఉపాధ్యాయులకు పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దతు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందం కాల పరిమితి ముగియడంతో కొత్త ఒప్పందం చేయాల్సి ఉంది. అయితే ఇరువర్గాల మధ్య ఒప్పందం జరగకపోవడంతో ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవడం లేదు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులను కలిసి తాము అండగా ఉంటామన్నారు. ఎన్నో వేల మందిని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులకు నష్టం జరిగితే సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి కనక భవాని, రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఎస్ఏడీలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. 'ప్రభుత్వ బడులు పరిరక్షించుకుందాం- పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' పేరిట ముద్రించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పైడిరాజు, ఉమాదేవి, రాంబాబు, సత్యం, రాము, రిజ్వాన్, రియాజ్ జిల్లాలోని 11 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానానికి వీల్ చైర్స్ బహూకరణ



వీల్ చైర్స్ అందిస్తున్న వైజాగ్ మెడికల్ సిండికేట్ సభ్యులు

సింధియా: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నడవలేని భక్తుల సౌకర్యార్థం వైజాగ్ మెడికల్ సిండికేట్ (హిందూస్థాన్ షిప్‌యార్డ్ కాలనీ) ప్రతినిధులు సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి రెండు వీల్ చైర్స్‌ను ఆదివారం బహూకరించారు. సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైజాగ్ మెడికల్ సిండికేట్ యాజమాన్యం, షిప్‌యార్డ్ డీజీఎం కాపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

200 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పంకజ్, డాక్టర్ కీర్తి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని పెదనడుపూరు లో గల నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆలయ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 200 మందికి డాక్టర్ పంకజ్ డోంగ్రే, డాక్టర్ బెల్లాల కీర్తి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నెల 29లోగా వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ ఆస్పత్రికి వస్తే మరోసారి ఆధునిక పరికరాలతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెల్లాల జోగారావు, మంత్రి శంకరనారాయణ, కొత్త సూర్యనారాయణ, మునగపాక బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదపూజ



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాదచరణాలకు భక్తులు పాదపూజ నిర్వహించారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్‌లో ఆదివారం ఉదయం పండితుల వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పాదపూజ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం కోసం విచ్చేశారు. పలువురు భక్తులు మంత్రోపదేశం తీసుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

రైళ్ల రద్దుతో అవస్థలు

అగనంపూడి: విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు రాజమండ్రి, విజయవాడ మీదుగా నడుస్తున్న రైళ్లను అర్ధాంతరంగా రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, చంద్రరావు, జాషువ పేర్కొన్నారు. ఆదివారం వారు రాజీవ్‌నగర్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.

కడియం, నిడదవోలు రైల్వేస్టేషన్ల మధ్య ఆధునికీకరణ పనుల దృష్ట్యా జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం రద్దీగా రాకపోకలు సాగించే ఈ రైళ్లను రద్దు చేస్తే వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతారన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

'కోర్కెల దినం' విజయవంతం చేయండి



ప్రసంగిస్తున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

ఉక్కునగరం: మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటోందని, అందుకు అడ్డుకట్ట వేసేందుకు జూలై 10న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కోర్కెల దినం విజయవంతం చేయాలని సీఐటీయు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. ఆదివారం ఉక్కునగరంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం వల్ల కార్మికవర్గం శ్రమదోపిడీకి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, బి.జగన్, పి.వెంకటరెడ్డి, శ్రీనివాస్, యు.రామస్వామి పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేం



ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీయాద్రి అప్పలరాజు, తదితరులు



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బీజేపీ గాజువాక కార్యాలయంలో ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేమని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జాతీయవాద ఆలోచనలను ప్రోత్సహించి, జాతీయ సమైక్యత కోసం పట్టుదలతో పని చేశారని బీజేపీ సీనియర్ నాయకుడు సీయాద్రి అప్పలరాజు అన్నారు. దేశంలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయ మార్గం చూపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను ఆ వార్డు బీజేపీ అధ్యక్షుడు జీలకర్ర రమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీలకర్ర భువనేశ్వరి, శేఖర్, రవి, సన్యాసమ్మ, అనిత, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ 79, 85వ వార్డుల నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.ఈశ్వరరావు, కె.తాతారావు మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆలోచనా విధానంతో బీజేపీ పుట్టుకొచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కె.సింహాద్రి, ఎం.లోకేష్ పాల్గొన్నారు.

గాజువాక: భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం బీజేపీ గాజువాక కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ గాజువాక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య మాట్లాడుతూ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. దేశ ఐక్యతకు ఆయన తన ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, వి.రోహిణి, బొండా ఎల్లాజీరావు, సోంబాబు, శశిధరణ్ పిళ్ళై, వెంకటరావు, అప్పలరాజు, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రక్షక్ డ్రైవర్‌కు ద్వారకా పోలీసుల ఆర్థిక సాయం



సురేష్‌కు రూ.30 వేలు అందజేస్తున్న సీఐ రమేష్, ఎస్ఐలు, సిబ్బంది

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన కమ్యూనిటీ హోం గార్డు డ్రైవర్ కుటుంబానికి ద్వారకా స్టేషన్ పోలీసులు బాసటగా నిలిచారు. ఈ స్టేషన్ రక్షక్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సురేష్ కంచరపాలెం జాషువానగర్‌లో భార్య, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సురేష్ తన కుమార్తె పూజిత(9)తో కలిసి రైల్వే న్యూకాలనీ వెళ్లి తిరిగి వస్తుండగా తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో సురేష్ కుటుంబానికి ద్వారకా జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్టేషన్‌లో ద్వారకా సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది రూ.30 వేలను సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ డి.వి.రత్నం, హెచ్‌సీలు శంకర్, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, రామ్మూర్తిరాజు, పీసీలు ఎస్.రమేష్, కె.టి.వి.రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం



లఘు నాటిక ప్రదర్శిస్తున్న గ్రూప్ సభ్యులు



ఘంటసాల గానావధానం నిర్వహిస్తున్న డాక్టర్ రహమతుల్లా

సీతంపేట: ఘంటశాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్యుడు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో గాయనీగాయకులు పాత పాటలను మధురంగా పాడారు. టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి చెడుగుడు ఆట తరహాలో పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. ఈ సందర్భంగా సోమయాజుల సత్యవాణి, హెచ్.సావిత్రి, సిహెచ్.నందగోపాల్ ప్రదర్శించిన ఘంటసాల లఘు నాటికలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి. గానలహరిలో గాయనీ గాయకులు డాక్టర్ కె.రామ్మూర్తి, ఎం.ఎస్.వి.సుబ్బారావు, జి.నానాజీ, కె.రాజేంద్రప్రసాద్, బెహరా మురళి, బి.కల్యాణి, ఎస్.రేణుక ఆలపించిన ఘంటసాల పాటలు ఉర్రూతలూగించాయి. చివరగా డాక్టర్ రహమతుల్లా నిర్వహించిన ఘంటసాల గానావధానం ప్రక్రియ తీరు ఆకట్టుకుంది. వ్యాఖ్యాతగా మేడా మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మహేష్, జి.వి.రావు, కె.రంగారావు పాల్గొన్నారు.